[ఉన్మత్తుల కాలం-భీకరనరహత్యలు, మాన భంగాలు జరుగుతూన్న రంగం-నిర్భాగ్య జీవులు ఆస్తిపాస్తులు, ఆలుబిడ్డలు లెక్క చెయ్యకుండా వలసబోతూన్న ఘట్టం-]

విజ్ఞాని : నే నాలోచిస్తున్నాను - మధ్య మాట్లాడించకు.

చరిత్రకారుడు : ఏ మాలోచిస్తున్నావు? నా పుస్తకంలో ఓ కాగితం చిరిగిపోయింది-ఆవేళ తారీకు ఎంత! అక్టోబరు ఇరవైఆరా, ఏడా...!

వి : చెప్పుతా చెప్పుతా! నిన్నరాత్రి ఆ రక్త కల్లోల ప్రారంభానికి అరగంట ముందే నా కొక సూచన కనుపించింది-నా ప్రయత్నం ఫలోన్ముఖం కాబోతూందని. కాని–

మానవుడు : అదిగో! మళ్లీ వస్తున్నారు. (పెద్ద కేకలు) బాబోయ్-చూడలేను-నరకం!

చ : నాదరుషా దేశంమీద దాడి చేసినప్పుడు నేను చేసిన వర్ణన చదివితీరాలి.

మా : నీచరిత్ర మండిపోను-అవతల పీకలు ఎగిరి పోతూంటే మధ్య నీ గోలేమిటి? నా కాళ్లు లాగుకుపోతున్నాయి-ఆకలి, ఆకలి-

వి : ఆకలిలేకుండా చేస్తాను మానవజాతిని, యీ ప్రయాణం ముగియనీ - దేశానికి స్వాతంత్ర్యం రావడం మంచిదే గాని, నా పరిశోధనాగారం దెబ్బతింది–లేకుంటే...

మా : లేకుంటే- దేశంలోనేకాదు- దేశంనుంచి దేశం వలసపోవలసి వచ్చినా నీ విజ్ఞానం వల్ల ప్రయాణం సుకరం చేస్తావుకాబోలు.

చ : అలాంటి విషయాలు మరీ మజాగా వుంటాయి - తైమూరు దండయాత్ర చేసినప్పుడు ఢిల్లీనగరాన్ని పదిహేను రోజులు దోచుకొన్న సందర్భంలో నేను చేసిన రికార్డు

మా : జలియన్‌వాలాబాగ్‌లో నువ్వెక్కడా అగుపించలేదేం? పశువా! అటు చూడు! చంటిపిల్లల్ని బ్రతికివుండగా సగం పాతిపెట్టి—

చ : ఇబ్రహీమ్ లోడీ ... (అంటూండగా ఒక పెద్ద గూండాముఠా దూసుకుపోయి ముగ్గుర్నీ వేరు చేసింది– ఐదు నిమిషాలలో మళ్లీ కలుసుకున్నారు.)

వి : ఇదంతాచూస్తే నాకొక ఆలోచన తట్టింది- మానవుణ్ణి అమరుడుగాచెయ్యడంకన్న అదృశ్యుడు గానో, మానసవేగగామి గానో చెయ్యగలిగిన సాధనం కనిపెట్టాలి.

చ : గొప్ప వుద్దేశం— ఏంపోయింది— ఓయ్ మానవుడా- ఇవాళ తారీకెంత? మన విజ్ఞానానికి కలిగిన వుద్దేశాన్ని ఆధారపరచుకుని, ఒక జరగని విషయాన్ని జరిగినట్టు రికార్డు చెయ్యాలి—

మా : (ఆశ్చర్యంగా) అబద్ధాలు రాస్తావా!

వి : అబద్ధాలు రాయకూడదు—నా విజ్ఞానం యావత్తూ సత్యం మీదే ఆధారపడివుంది- కాని పరమసత్య జిజ్ఞాసువు అయిన విజ్ఞాని...

మా : జీవితంలో సత్యం పూజ్యం—

వి : పొరపడ్డావు — సత్యదూరమైన జీవితం మానవకళ్యాణానికి తోడ్పడలేదు.

మా : ఇది ప్రత్యక్షవిషయం.

వి : కాని నేను చేస్తున్న కృషిచూడు-ప్రయాణం ఎంతసుకరం అయిపోయిందో విమానంవల్ల—

(ఢన్‌మని బాంబుపడింది)

చ : చచ్చాం! జ్ఞాపకం వస్తున్న నేటి తేదీ మర్చిపోయా——

మా : పేలింది!!

వి : (నిర్వీర్యపోతాడు.)

చ : అయ్యో, నా చెయ్యి తెగిపోయింది-నెత్తురు!

మా : (విజ్ఞానితో) అయితే విమానాలు——సౌకర్యమైన ప్రయాణానికా - భీకరమైన బాంబులకా——

వి : అది నా తప్పుకాదు——మానవుడా! నీ తప్పే! నీ జీవితాన్ని గులాబీతోటలో ప్రతిష్ఠించడం నా వంతు——అనుభవించడం నీ వంతు. చూడు, మనిషి కాలుకదపక్కర్లేకుండా పొట్టలోకి ఆహారం వచ్చేమార్గం కనిపెట్టాను-భూమిని తడిపి-దున్ని-'

(మహాసంక్షోభం - భీషణకోలాహలం - మాట వినపడదు-విజ్ఞాని మానవుడి చెవిలో అరుస్తున్నాడు కళ్లు పెద్దవిచేసి)

'నూర్చి, మిల్లు ఆడించి, వంటచేసి...

(ప్రళయశివతాండవంనాడు పుట్టిన శబ్దాన్ని ధిక్కరిస్తూ - యిసక జల్లినట్టు గుళ్లు చెరుగుతూ మెషిన్‌గన్ అమర్చినట్రాక్టర్ దూసుకుపోతూంది)

'యంత్రాలు పని చేస్తూంటే......మానవుడు హాయిగా...'

(ఆక్రందనాలు-స్త్రీల హృదయ విదారక రోదనలు)

మా : ఆహ్హాహ్హా! ఏం చేస్తున్నాడు-పనిలేక కొవ్వి పశుతుల్యంగా తోడిమానవుల్ని చిత్రవధ చేస్తూన్నాడు. పనిలేక వున్మత్తుడై పట్టపగలు బహిరంగంగా అన్నఎదుట చెల్లెలినీ, కొడుకు ఎదుట తల్లినీ – భర్త ఎదుట భార్యనీ...ఛీ!

చ : (ఏడుస్తూ) మానవుడా ! రెండుముక్కలు రాసిపెట్టు—ప్రయాణం సుకరంగా వుందని-సర్వసదుపాయాలు పరిపాలకులు చేస్తూన్నారనీ, స్త్రీలకు ప్రత్యేకం- పురుషులకు ప్రత్యేకం- రోడ్లు బాగున్నాయని ... అయ్యో చెయ్యి తెగిపోయింది...నెత్తురు !

మా : ఇంకా, యింకా...

చ : ప్రయాణీకుల సౌఖ్యంకోసం రోడ్ల కిరుప్రక్కలా చెట్లు వేశారని, నూతులు త్రవ్వించారని

మా : గోతుల్లో పాతిపెట్టారనీ - సొట్టగాడిదా—అటు చూడు ఈజీచైరులో కూచుని కాఫీ తాగుతూ దొంగరాతలు రాయడంకాదు-ఆ ఏడుస్తూన్న అనాథులైన చంటిపాపల్ని తొక్కుకుపోతూన్న నరరూపరాక్షసుల్ని చూడు——ఆ పరుగెడుతూన్న నిర్భాగ్య యౌవనాంగుల వస్త్రాలమీద యింకా ఆరని నెత్తురుమరకలు చూడు——

చ : ఉ ! ఉ ! ఉ ! నాచెయ్యి నొప్పి

(దూరంనుంచి మెషిన్‌గన్ లోంచి రెండుగుళ్లు వచ్చి విజ్ఞాని రెండుకళ్లూ లొట్టకొట్టేయి)

వి : అబ్బ ! ఆహాహాహా ! నాకళ్లు !

(ప్రజాసముద్రం మళ్లీ విజృంభించి వీళ్ళమధ్య నుంచి దూసుకుపోయింది- వేరయిపోయారు——దుఐ నిమిషాలు పోయాక.)

వి : అయ్యో మానవుడా - నాకు ప్రపంచం అంతా నిబిడాంధకార సమావృతం అయిపోయింది- నా సాధనసామగ్రి- నా పరిశోధనాగారం !

చ : మానవుడా ! నా చెయ్యి చిల్లికుండవలె నెత్తురు కారిపోతూంది - నా గ్రంథాలు అసంపూర్తిగా వుండిపోతాయి కామోసు.

మా : అదిగో మన గమ్యస్థానం-అదిగో సింహద్వారం-పదండి.

వి : నాకేమీ కనుపించదు-నేను అంధకారంలో మునిగిపోయాను.

మా : నువ్వేకాదు-నీ ప్రతాపంవల్ల ప్రపంచంలో చాలాభాగం అంధకారబంధురం అయింది. నీ వికటాట్టహాసంలో పుట్టిన దెయ్యపుశక్తిని పిడికిటిలో బిగబట్టి కళ్లుకానని దేశాలు ప్రపంచాన్ని గజగజ లాడిస్తున్నాయి.

చ : మానవుడా-నాచెయ్యి...నెత్తురు...

మా : కారనీ కారనీ! అది నెత్తురుకాదు...సం చిత పంకిలం-ప్రబంధయుగంలో ఎవరో సౌశీల్యాన్ని పరిపాలకుల కాలిక్రింద మట్టిగా మార్చి ఉదరం పోషించుకుంటే-యీ యుగంలో సత్యాన్ని, మానవ జీవితాన్ని తారుమారు చేశావు పనిలేక నువ్వు...పదండి యిద్దరూ-అదిగో మన రాజ్య సింహద్వారం-సమీపించాం!

ద్వారపాలకుడు : (గట్టిగా) ఎవరు మీరు-ఆగండి-నువ్వెవరు?

మా : మానవుణ్ణి.

ద్వా : నాయనా, అటువెళ్లు- గులాబీతోటలలోకి, బంగారు మేడలలోకి- అవి మానవులకి——

(మిగిలిన యిద్దరూ గజగజ వణికిపోతూంటారు)

ద్వా : (అధికారసూచకంగా- గట్టిగా) ఎవరు మీరు !

వి : (తొట్రుపాటుతో) అ-జ్ఞా-ని

చ : (తొందరతో) అసత్యకారి-

ద్వా : హుఁ! అటు వెళ్లండి. అటు-

(మానవుడు కొంతదూరం వెళ్లి తనతో వచ్చిన వారు యింకోవేపు త్రోసివేయబడడం గమనించి-ద్వారపాలుడితో)

మా : అటేముంది ?

ద్వా : (నవ్వుతూ) ఉన్మాదశాల !

సంఘస్వామ్యం : మతవిశ్వాసం

'సామాన్యుడు'

జీవితావసరముల ఉత్పత్తి సరఫరాలతో యేవిధమయిన సంబంధం లేకపోయినా, మతం మానవజాతుల జీవితంలో ఆక్రమించే భాగం, ప్రాముఖ్యం మరేదీ ఆక్రమించుకోవడం లేదు.

మన కెదురుపడినవాణ్ణెవర్నయినా, 'నువ్వేమతస్థుడ'వని అడిగితే. హిందూ మతస్థుడననో, క్రైస్తవ మతస్థుడననో ఫెడీమని జవాబు చెబుతాడు. 'నిత్య జీవితంలో నీ మతానికి అర్థమేమి'టని అడిగితే, పురాణం చెప్పిన శాస్త్రుర్లవారిదగ్గిరో, ముల్లా దగ్గిరో, ఫాదరీదగ్గిరో విన్నదాన్నో, తీరికవున్న సమయంలో చదివిన మతగ్రంథంలోవో ఏకరువు పెడతాడు. ఇతర మతాలకూ నీ మతానికీ భేదం యేమిటంటే, విగ్రహారాధనో, కులాలో, మొగవాడు రెండు పెళ్ళిళ్లు చేసుకోడమో యేదో జవాబు చెబుతాడు. వీరందరికీ నిక్కచ్చిగా తెలిసింది తమరు 'ఫలానా మతానికి చెందినవార మనేది ఒక్కటే! వారివారి మతాలమీద ప్రతివారికీ అభిమానమూ; దాన్ని సంరక్షించాలనీ, వ్యాప్తి చెయ్యాలనీ నిశ్చయమూ సాధారణంగా కనుపిస్తూవుంటవి. ఇవన్నీ చాలామందిలో, ఆలోచనమీదకన్న, అలవాట్లమీద అభ్యాసంమీద యెక్కువ ఆధారపడివుంటవి. మతాభిమానం లేనివారు లేరు. మతమంటే ఇదమిత్థమని తెలుసుకున్నవారు చాలా అరుదు.

తర్జనభర్జన చేసి చూస్తే, ప్రతిమతమూ భగవంతుడికి సంబంధించి వున్నట్లు తోస్తుంది. మతాలవారందరూ భగవంతుడు ఉన్నాడనో, లేడనో విశ్వసించేవారు. ఉన్నాడని విశ్వసించేవారు ఆస్తికులు, లేరనేవారు నాస్తికులు. ప్రపంచంలో ఆస్తికుల సంఖ్య చాలా విపరీతం. నాస్తికుల సంఖ్య చాలా 'స్వల్పం'. ఇందుకు కారణాలు చాలా వున్నవి.

మతమనే మాటకు ఆంగ్లంలో సమపదమయిన 'రెలిజియన్', రెలిజయోన్ అనే లాటిన్ మాట నుంచి పుట్టింది. దానికి 'భయం' అని అర్థం. దేన్నో గురించిన భయాన్ని కల్పించేది మతం.

'ప్రపంచంలో ప్రతి సంఘటనకు ఒక కారణం వుంది. కారణంలేని కార్యంలేదు. ప్రకృతిధర్మాల ననుసరించి యీ కార్యాలన్నీ నడుస్తున్నవి అని విశ్వసిస్తే, భగంతుడితో నిమిత్తంలేకుండాపోతుంది. ఆ కారణాలను అన్వేషించడమే విజ్ఞానంయొక్క ప్రయోజనం' అంటారు, కొంతమంది ఆధునిక మేధావులు.